క్లుప్తంగా

ప్రజావాణికి 4 దరఖాస్తులు


మోమిన్‌పేట ప్రజావాణిలో అధికారులు

మోమిన్‌పేట: మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి 4 దరఖాస్తులు వచ్చాయని ఎంపీడీఓ విజయలక్ష్మి తెలిపారు. దరఖాస్తులను పరిశీలించి సమస్య పరిష్కరించనున్నట్లు ఆమె పేర్కొన్నారు. వ్యక్తిగత, సమూహిక సమస్యలను త్వరితగతిన పరిష్కరిస్తామని చెప్పారు. కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి జయశంకర్, ఎంపీఓ యాదగిరి, పశు వైద్యాధికారి గీత, పీఆర్ ఏఈఈ ప్రణీత్ కుమార్, ఏపీఓ శంకర్, ఏపీఎం రాజు తదితరులు ఉన్నారు.

శివుడికి ప్రత్యేక పూజలు


పూజలు చేస్తున్న ఎస్‌ఐ దంపతులు

దౌల్తాబాద్: మండల కేంద్రంలోని నీలకంఠ స్వామి ఆలయంలో సోమవారం ఎస్‌ఐ రవి గౌడ్ కుటుంబసమేతంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమావాస్య కావడంతో పూజల్లో పాల్గొన్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. తీర్థ ప్రసాదాలు అందజేశారు. అనంతరం అన్నదాన కార్యక్రమంలో పాల్గొన్నారు.

చెరువు తూముకు మరమ్మతులు


జేసీబీతో మరమ్మతులు చేస్తున్న గ్రామస్తులు

దుద్యాల్: మూడు రోజులుగా కురుస్తున్న వర్షాలకు గ్రామాల్లో చెరువులు, కుంటలు నిండుకున్నాయి. దుద్యాల్ పెద్ద చెరువులోకి భారీగా వరద చేరుతోంది. సోమవారం అటుగా వెళ్లిన గ్రామస్తులు చెరువు తూము నుంచి నీరు వృథాగా పోతుండటంతో గమనించి, కాంగ్రెస్ పార్టీ జిల్లా కార్యదర్శి మెరుగు వెంకటయ్యకు విషయం తెలియజేశారు. స్పందించిన ఆయన జేసీబీ సహాయంతో తూముకు మట్టి పోయించారు. దీంతో తూము నుంచి లీకేజీ ఆగిపోయింది.

పంటల పరిశీలన


పంటలను పరిశీలిస్తున్న తహసీల్దార్ కిషన్

పెద్దేముల్: ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలకు పంటలు దెబ్బతినడంతో సోమవారం పెద్దేముల్ తహసీల్దార్ కిషన్ మండలంలోని గాజీపూర్, బుద్దారం గ్రామాల్లో పర్యటించి పంటలను పరిశీలించారు. చేతికి వచ్చిన మినుము, పెసర పంటలు మొలకెత్తాయని ఆందోళన వ్యక్తం చేశారు. అలాగే, కంది, పత్తి పంటలు నీట మునిగి పాడయ్యాయని, ప్రభుత్వం ఆదుకోవాలని రైతులు కోరారు. వాగులు, చెరువులకు దగ్గరలో ఉన్న పత్తి, కంది పంటలు పాడయ్యాయని రైతులు తెలియజేశారు.

ఇల్లు కూలింది.. ఆదుకోండి


కస్తూరుపల్లిలో కూలిన ఇల్లు

కొడంగల్ : రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలకు మండలంలోని ఆయా గ్రామాల్లోని పలువురి ఇళ్లు కూలిపోయాయి. దీంతో సోమవారం బాధితులు కొడంగల్ తహసీల్దార్ విజయకుమార్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. అంగడి రాయిచూర్‌కు చెందిన కల్యాణ్‌కుమార్, కస్తూరుపల్లికి చెందిన గోపాల్‌రెడ్డి, మల్లమ్మ, శ్యామమ్మ, పర్సాపూర్ రాజు, రుద్రారం మహ్మద్‌లతీఫ్ ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు.

ఇన్‌చార్జి ఏఓగా తులసి



బొంరాస్‌పేట: మండల వ్యవసాయ అధికారి అనురాధ బదిలీ అయ్యారు. సోమవారం పరిగి ఏఈఓగా ఉన్న తులసి మండల ఇన్‌చార్జిగా ఏఓగా నియమితులయ్యారు. వ్యవసాయశాఖ ఏఈఓగా పర్యవేక్షించడంతో పాటు, ఏఓగా తులసి బాధ్యతలు నిర్వహించనున్నారు.

వాన.. హైరానా!

జిల్లాలో కురుస్తున్న జోరువానలకు ప్రాజెక్టు లు, చెరువులు, వాగులు నిండి మత్తడిపోస్తున్నాయి. గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి. పొలాల్లో వరదనీరు చేరి పంటలు పాడయ్యాయి. పలుచోట్ల ఇళ్లు కూలిపోయా యి ప్రజలు నానా అవస్థలు పడుతున్నారు. లోతట్టు ప్రాంతాలు, రోడ్లు జలమయం అవడంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు.

– సాక్షి, నెట్‌వర్క్


పరిగి: అలుగు పారుతున్న లక్నాపూర్ ప్రాజెక్ట్ వద్ద చేపలు పడుతున్న జాలర్లు


మర్పల్లి: నీట మునిగిన మొక్కజొన్న పంట


బొంరాస్‌పేట: పాల్కితండా వద్ద..


దోమ : పాలేపల్లిలో వర్షానికి కూలిన ఇంటి గోడ


మోమిన్‌పేట: టేకులపల్లిలో..


కొడంగల్ : నిండు కుండలా కొడంగల్ చెరువు


బొంరాస్‌పేట: అలుగుపారుతున్న దొరచెరువు

కూలిన ఇళ్లకు ఆర్థిక సాయం

ఆర్డీఓ శ్రీనివాసరావు



తాండూరు: భారీ వర్షాల కారణంగా తాండూరు రెవెన్యూ డివిజన్ పరిధిలో 27 ఇళ్లు పాక్షికంగా కూలిపోయాయని సోమవారం తాండూరు ఆర్డీఓ శ్రీనివాస్‌రావు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. 1వ తేదీన 13 ఇళ్లు, 2న 14 ఇళ్లు కూలిపోయాయని తెలిపారు. ఆయా మండలాల రెవెన్యూ, మున్సిపల్ అధికారులు కూలిన ఇళ్లను పరిశీలించారని చెప్పారు. తాండూరు పట్టణంలో 2 ఇళ్లు, పెద్దేముల్ మండలంలో 1, యాలాల మండలంలో 2, బొంరాస్‌పేట్-2, దౌల్తాబాద్ మండలంలో 6 ఇళ్లు కూలిపోయాయి. సోమవారం బషీరాబాద్ మండలంలో 2, బొంరాస్‌పేట్‌లో 2, కొడంగల్ మండలంలో 6, తాండూరు పట్టణంలో 1, యాలాల మండలంలో 3 ఇళ్ల పాక్షికంగా దెబ్బతిన్నాయన్నారు. బాధితులకు ప్రభుత్వం నుంచి ఇంటికి రూ.4 వేల చొప్పున ఆర్థిక సాయం అందించేందుకు జిల్లా కలెక్టర్‌కు నివేదికలను పంపించామని చెప్పారు.

ప్రతీ ఇంటికి సంక్షేమ పథకాలు


సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే

ఎమ్మెల్యే రామ్మోహన్ రెడ్డి

కుల్కచర్ల: అర్హులైన ప్రతి ఒక్కరికి రుణమాఫీ వర్తిస్తుందని ఎమ్మెల్యే రామ్మోహన్ రెడ్డి అన్నారు. సోమవారం మండల కేంద్రంలో విలేకరులతో ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలన్నింటిని తప్పనిసరిగా అమలు చేస్తోందన్నారు. ఇచ్చిన హామీ ప్రకారం రూ. 2లక్షల రుణమాఫీ అమలు చేశామన్నారు. రూ. 2లక్షల కంటే ఎక్కువగా ఉన్నవారికి రూ. 2లక్షల మాత్రమే మాఫీ అవుతుందని స్పష్టం చేశారు. త్వరలోనే ప్రజాపాలన నిర్వహించి అర్హులైన వారందరికీ రేషన్‌కార్డులు, రాజీవ్ ఆరోగ్యశ్రీకార్డులు అందిస్తామని వివరించారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు తదితరులు పాల్గొన్నారు.

చెరువుల మరమ్మతులకు చర్యలు

దోమ : చెరువుల మరమ్మతులకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని తహసీల్దార్ పురుషోత్తం, ఎంపీడీఓ జయరాం అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని పెద్ద చెరువు తూము గండి పడడంతో స్థానిక రైతులు రెవెన్యూ, ఇరిగేషన్ అధికారులకు సమాచారం ఇచ్చారు. ఈ క్రమంలో ఇరిగేషన్ డీఈ ప్రార్థసారధి, ఏఈ సిద్దార్థ్ తహసీల్దర్, ఎంపీడీఓతో కలసి సందర్శించి చెరువు తూమును పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. కురుస్తున్న వర్షాలకు చెరువు నిండు కుండలా మారడడంతో తూము దగ్గర లీకేజీ అవ్వడంతో పాటు గండి ఏర్పడుతుందన్నారు. దీంతో చెరువులోరని నీరు వృథాగా పోవడమే కాకుండా దిగువన ఉన్న పంట పొలాల్లో చేరి పంటలను నాశనం చేస్తున్నాయని తెలిపారు. క్రమంలో గండి పడ్డ చెరువుకు మరమ్మతులు చేయించి నీరు నిల్వ చేశామని అధికారులు తెలిపారు. కార్యక్రమంలో ఆర్‌ఐ సుదర్శన్, మాజీ జెడ్పీటీసీ లక్ష్మయ్య, రైతులు పాల్గొన్నారు.


తూమును పరిశీలిస్తున్న తహసీల్దార్ పురుషోత్తం, ఎంపీడీఓ, ఇరిగేషన్ అధికారులు

జాగ్రత్తలు పాటించాలి

తాండూరు: గణేశ్ మండపాల వద్ద జాగ్రత్తలు పాటించాలని తాండూరు డీఎస్పీ బాలకృష్ణారెడ్డి నిర్వాహకులకు సూచించారు. సోమవారం ఆయన మాట్లాడుతూ.. మండపాలు ఏర్పాటు చేసేవారు పూర్తి వివరాలు ఆన్‌లైన్‌లో పొందు పరచాలన్నారు. విగ్రహాలు ఉంచే చోట వర్షం నీరు రాకుండా చూసుకోవాలన్నారు. కరెంటు కోసం విద్యుత్ అధికారుల అనుమతులు తప్పని సరిగా తీసుకోవాలని తెలిపారు. స్తంభాల నుంచి నేరుగా కనెక్షన్ తీసుకుంటే ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని అన్నారు. మండపంలో విద్యుత్ తీగలను నేలపై ఉండరాదని స్పష్టం చేశారు. అర్ధరాత్రి తరువాత మైకులు ఆఫ్ చేయాలని ఆదేశించారు. డీజేలకు అనుమతులు లేవని పేర్కొన్నారు. పోలీసు అధికారులు ఎప్పటికప్పుడు మండపాలను పరిశీలిస్తారని చెప్పారు. మండపాల వద్ద లక్కీ డ్రాల పేరిట ప్రజలకు ఇబ్బందులు కలిగించినా, ట్రాఫిక్ సమస్యకు కారణమైనా ఉపేక్షించేది లేదన్నారు. ప్రశాంతమైన వాతావరణంలో ఉత్సవాలు నిర్వహించుకోవాలన్నారు. శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. భారీ వర్షాల నేపథ్యంలో చెరువులు, కుంటలు నిండాయని, వాగులు ప్రవహిస్తున్నాయని ప్రజలు వాటి వద్దకు వెళ్లరాదని సూచించారు.


బాలకృష్ణారెడ్డి, తాండూరు డీఎస్పీ

మరుపురాని మహానేత వైఎస్సార్


పరిగి: వైఎస్ వర్ధంతి కార్యక్రమంలో ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి

ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి

పరిగి: వైఎస్సార్ ప్రజల గుండెల్లో చిరస్మరణీయంగా నిలుస్తారని పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి అన్నారు. సోమవారం దివంగత మాజీ ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి 15వ వర్ధంతి సందర్భంగా కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఆయన విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. రైతు సంక్షేమం కోసం కృషి చేసిన రైతుబాంధవుడు వైఎస్సార్ అన్నారు. ఆరోగ్యశ్రీ పథకంతో పేదల జీవితాల్లో వెలుగులు నింపారన్నారు. ఏ ప్రభుత్వాలు చేయని విధంగా రైతులకు ఏకకాలంలో రుణమాఫీ చేశారని కొనియాడారు. కార్యక్రమంలో డీసీసీ ఉపాధ్యక్షుడు లాల్‌కృష్ణ, ప్రధాన కార్యదర్శి హన్మంతుముదిరాజ్, పట్టణ, మండల అధ్యక్షుడు కృష్ణ, పరశురాంరెడ్డి, రాంరెడ్డి, మల్లేశ్, ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్ కృషి చారిత్రాత్మకం

కుల్కచర్ల: పేద ప్రజల అభ్యున్నతికి వైఎస్సార్ చేసిన కృషి చారిత్రాత్మకమైనదని కాంగ్రెస్ పార్టీ నేతలు ఉమాపతిరెడ్డి, చాకల్‌పల్లి శేఖర్ అన్నారు. ఆయన వర్ధంతిని పురస్కరించుకుని సోమవారం కుల్కచర్ల, చౌడాపూర్ మండలాల పరిధిలోని ఆయా గ్రామాల్లో వైఎస్ చిత్ర పటాలకు నివాళులర్పించారు.

మహానేతకు ఘన నివాళి

ధారూరు: మండలంలోని కేరెల్లి గ్రామంలో సోమవారం దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి వర్ధంతిని ఆయన అభిమానులు ఘనంగా నిర్వహించారు. మహానేత చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. రైతులు, యువజన సంఘాల సభ్యులు, అభిమానులు పెద్ద ఎత్తున పాల్గొనడంతో వర్ధంతి ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా కాంగ్రెస్ నాయకులు మాట్లాడుతూ.. ఉమ్మడి రాష్ట్రంలో ఒకే దఫా రైతు రుణమాఫీ చేసిన ఘనత వైఎస్సార్‌కే దక్కుతుందన్నారు. ఉచిత విద్యుత్, ఆరోగ్యశ్రీ , 104, 108 వాహన సేవలు ఇప్పటికీ తెలంగాణ ప్రజలు మర్చిపోలేరని గుర్తు చేసుకున్నారు. కార్యక్రమంలో వైఎస్ అభిమానులు దయాకర్‌రెడ్డి, చెన్నారెడ్డి, నాగయ్య తదితరులు పాల్గొన్నారు.

వైఎస్ హయాంలోనే అభివృద్ధి

పెద్దేముల్: స్వర్గీయ రాజశేఖర్‌రెడ్డి హయాంలోనే గ్రామాలు, పల్లెలు అన్ని విధాల అభివృద్ధి చెందాయని మండల కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు గోపాల్ అన్నారు. సోమవారం మండలంలోని తట్టెపల్లితో పాటు పలు గ్రామాల్లో దివంగత నేత మాజీ ముఖ్యమంత్రి రాజశేఖర్‌రెడ్డి వర్ధంతిని ఘనంగా నిర్వహించారు.


చౌడాపూర్‌లో నివాళులర్పిస్తున్న నాయకులు


బంట్వారం: వైఎస్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న అభిమాని సుజాత


పెద్దేముల్: రాజన్న విగ్రహానికి నివాళులర్పిస్తున్న నాయకులు


ధారూరు: వైఎస్సార్ చిత్రపటానికి నివాళుర్పిస్తున్న నాయకులు

భక్తిశ్రద్ధలతో శ్రావణమాస ముగింపు పూజలు

జిల్లాలో శ్రావణమాస ముగింపు పూజలు సోమవారం భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. చివరి శ్రావణ సోమవారం కావడంతో ఆయా ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. సోమవతి అమావాస్య కూడా కలిసి రావడంతో భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించి, అభిషేకాలు చేసి స్వామివారికి నైవేద్యాలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. అనంతరం భక్తులకు పూజారులు తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు.


యాలాల: పల్లకీ సేవ నిర్వహిస్తున్న భక్తులు


తాండూరు రూరల్: జినుగుర్తి ఆలయంలో..


ధారూరు: శివలింగానికి అభిషేకం చేస్తున్న భక్తులు


దౌల్తాబాద్: నీలకంఠేశ్వరస్వామి ఆలయంలో


పెద్దనందిగామ గ్రామంలోని శివాలయంలో..


మోమిన్‌పేటలో సంగమేశ్వరాలయంలో ..


తాండూరు: శైలేశ్వరుడిగా దర్శనమిచ్చిన శివుడు


బొంరాస్‌పేట: నాగిరెడ్డిపల్లిలో..


తాండూర్: రామలింగేశ్వర ఆలయంలో..

ప్రజా'వాణి' వినేదెవరు?

- ఒకటి రెండు శాఖల అధికారులే హాజరు
- తూతూ మంత్రంగా కార్యక్రమం నిర్వహణ

పెద్దేముల్: ప్రజావాణి కార్యక్రమాలకు అన్ని శాఖల అధికారులు హాజరుకావాలని కలెక్టర్ ప్రతీక్ జైన్ ఆదేశించినా, కిందిస్థాయి అధికారుల నిర్లక్ష్యంతో తూతూమంత్రంగా సాగుతోంది. సుమారు రెండు నెలల నుంచి ప్రజావాణి కొనసాగుతున్నా ఏ ఒక్క రోజు కూడా పూర్తిస్థాయిల్లో అధికారులు హాజరు కాలేదు. ప్రజావాణికి మండల పరిషత్, రెవెన్యూ అధికారులు మినహా మిగిలిన శాఖల వారు హాజరు కావడం లేదు. విద్యుత్, పంచాయతీ రాజ్, ఆర్‌డబ్ల్యూఎస్, వ్యవసాయ, విద్య, అంగన్‌వాడీ, ఇరిగేషన్, ఎంపీఓ, ఏపీఓ, ఏఎస్‌ఓ, అటవీశాఖ, వైద్య తదితర శాఖల అధికారులు హాజరు కావాల్సి ఉండగా, కేవలం ఒకటి, రెండు శాఖల అధికారులు మాత్రమే పాల్గొంటున్నారు. సోమవారం జరిగిన ప్రజావాణి కార్యక్రమానికి ఉదయం 10.30ను తహసీల్దార్ కిషన్, ఎంపీడీఓ జర్నప్ప, ఎంపీఓ రతన్‌సింగ్, పీఓ నర్సింలు హాజరయ్యారు. మిగతా అధికారుల జాడ లేదు. వచ్చిన అర్జీలను మండల అధికారులు తీసుకొని ఆయా శాఖల అధికారులకు పంపనున్నారు. ఎంపీడీఓ జర్నప్పను వివరణ కోరగా హాజరు కాని అధికారులపై కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తానని తెలిపారు.


పెద్దేముల్ ప్రజావాణిలో పాల్గొన్న అధికారులు

వసతి గృహానికి సాయం

అనంతగిరి: వికారాబాద్‌లోని ప్రభుత్వ బీసీ కళాశాల బాలికల వసతి గృహం-2కు పట్టణానికి చెందిన జిల్లా వడ్డెర సంఘం అధ్యక్షుడు వీఆర్ అంజిలయ్య శ్రీసాయికృష్ణ స్టోన్ గని వడ్డెర కోఆపరేటివ్ సొసైటీ లిమిటెడ్ తరఫున రూ. 25వేల చెక్కును కలెక్టర్‌కు అందజేశారు. ఈ సందర్భంగా అంజిలయ్యను కలెక్టర్ ప్రతీక్‌జైన్ అభినందించారు. ఈ డబ్బులతో టీవీని కొనుగోలు చేస్తామని జిల్లా బీసీ వెల్ఫేర్ అధికారి ఉపేందర్ చెప్పారు. వసతిగృహం విద్యార్థినులు వీఆర్ అంజిలయ్యకు ధన్యవాదాలు తెలిపారు.


అంజిలయ్యను సన్మానిస్తున్న విద్యార్థినులు

ఆకట్టుకున్న నృత్య ప్రదర్శన

అనంతగిరి: ఉత్తరప్రదేశ్‌లోని కాశీ వేదికగా ఐసీఎండీఏ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన నృత్య ప్రదర్శనలో వికారాబాద్‌కు చెందిన నటరాజ నృత్య అకాడమీకి చెందిన చిన్నారులు పాల్గొని చక్కటి ప్రదర్శన ఇచ్చారు. రావణకృత శివతాండవంపై చేసిన నృత్య ప్రదర్శన సభికులను ఆకట్టుకుంది. చిన్నారులు, డ్యాన్స్ టీచర్‌కు జ్ఞాపికలు అందజేసి, సన్మానించారు. కార్యక్రమంలో నృత్య అకాడమీ డ్యాన్సర్ టీచర్ శివజ్యోతి, చిన్నారులు మహాశ్రీ, అహర్‌శాద ఫణి సాయి, హర్షిత, అక్షయ, శ్రుతిక ఉన్నారు.


నృత్య ప్రదర్శనలో పాల్గొన్న చిన్నారులు